ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 11.04.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. రైతు భరోసా అంశంలో రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ అసత్య ఆరోపణలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విమర్శించారు.
2. అంగన్వాడీ సిబ్బందికి త్వరలోనే పదవీ విరమణ ప్రయోజనాలను కల్పిస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.
3. సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు.
4. ఐపీఎల్ క్రికెట్‌లో భాగంగా ఈరోజు చండీగఢ్‌లోని ముల్లాన్‌పూర్లో మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు జరిగే మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడుతాయి.

------------------------------

**తుమ్మల**

రైతు భరోసా అంశంలో రాష్ట్ర ప్రభుత్వంపై బీఆర్ఎస్ పార్టీ అసత్య ఆరోపణలు చేస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు విమర్శించారు. హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన రుణమాఫీ వడ్డీలకు మాత్రమే సరిపోయిందని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం కేవలం 9 రోజుల్లోనే 9 వేల కోట్ల రూపాయల రైతు భరోసా జమ చేసి రికార్డు సృష్టించిందని స్పష్టం చేశారు. రుణమాఫీ విషయంలో మాజీ మంత్రి హరీశ్ రావు కావాలనే అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. 2 లక్షల రూపాయల లోపు రుణం ఉన్న 25 లక్షల మంది రైతులకు రుణమాఫీ

చేశామని తుమ్మల స్పష్టం చేశారు. బ్యాంకులు సమర్పించిన సమాచారం ఆధారంగా రైతుల ఖాతాలో డబ్బులు జమ చేశామో లేదో సరి చూసుకోవాలని హితవు పలికారు.

**బైట్ : తుమ్మల నాగేశ్వరరావు**

**HYD –PTC**

-------------------------------

**అరైవ్-ఎలైవ్**

99 రోజుల ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 నుంచి 18 వరకు రాష్ట్రవ్యాప్తంగా అరైవ్ ఎలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. . రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రాణ నష్టాన్ని నివారించడమే ఈ కార్యక్రమ లక్ష్యం. ఈ నేపథ్యంలో దీని నిర్వహణకు సంబంధించిన సన్నాహక కార్యక్రమాలను పలు జిల్లాల్లో చేపడుతున్నారు.
జనగామ జిల్లాలో ప్రమాదాల నివారణ కోసం ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందించేందుకు అరైవ్ -అలైవ్ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేయాలని అధికారులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కోరారు.

రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ కార్యాలయంలో అరైవ్-అలైవ్ కార్యక్రమాలపై జిల్లా పోలీస్ అధికారులతో జిల్లా ఎస్పీ మహేష్ బీగీతే సమావేశం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 13నుంచి 18 వరకు అరైవ్- అలైవ్ కార్య క్రమాలను నిర్వహించాలని సూచించారు.

**పిటిసి, జనగామ, రాజన్న సిరిసిల్ల**

------------------------------

**మంచిర్యాల**

ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక " కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల జిల్లా చెన్నూర్ మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలీసు విభాగం ఆధ్వర్యంలో

మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. మాదక ద్రవ్య రహితంగా జిల్లాను తీర్చిదిద్దే కార్యాచరణలో భాగంగా యువతకు దిశానిర్దేశం చేస్తున్నామని తెలియజేశారు.

**పీటీసీ మంచిర్యాల జిల్లా**

-----------------

**డ్రగ్ ఫ్రీ సొసైటీ**

మాదక ద్రవ రహిత సమాజాన్ని సాధించేందుకు అందరూ కృషి చేయాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద పేర్కొన్నారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న ఆరోగ్య వారంలో మాదక ద్రవ్యాల నియంత్రణ, నియంత్రణ వ్యవస్థ బలోపేతం అన్న అంశంపై ర్యాలీ నిర్వహించారు.

**వరంగల్ - పీటీసీ**

-----------------------------

**అంగన్వాడీ - సీతక్క**

అంగన్వాడీ సిబ్బందికి త్వరలోనే పదవీ విరమణ ప్రయోజనాలను కల్పిస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. ములుగు జిల్లా కేంద్రంలో పోషణ పక్షోత్సవాలను మంత్రి సీతక్క ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క అంగన్వాడీ సూపర్వైజర్లకు నూతన సెల్ ఫోన్లను అందించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పోషకాహార స్టాల్ ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఒకటి నుండి 6 ఏళ్లలోపు బాలబాలికల ఎదుగుదలకు, గర్భిణీలు బాలింతలకు కూడా పౌష్టికాహారం అందించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఇప్పటికే అంగన్వాడీ కేంద్రాలను మెరుగు పరుస్తూ అంగన్వాడీ టీచర్ల సమస్యలు పరిష్కరిస్తున్నామని అన్నారు.

**సౌండ్ బైట్ : సీతక్క**

**పీటీసీ, ములుగు**

------------------------------

**వాతావరణం**

వచ్చే మూడు రోజుల్లో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు క్రమంగా 2 డిగ్రీల సెల్సియస్ నుంచి 3 డిగ్రీల సెల్సియస్ మేర పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. అలాగే రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

**పీఎస్**

---------------------------------

**హైడ్రా కూల్చివేతలు**

సంగారెడ్డి జిల్లా అమీన్పూర్ మండలంలోని అయిలాపూర్లో అక్రమ నిర్మాణాలను హైడ్రా కూల్చి వేస్తోంది. అయిలాపూర్ లోని సర్వే నెంబర్ 201, 202, 221లో ఉన్న భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని కోర్టు స్టే ఆర్డర్ ఉన్నప్పటికీ వాటిని విస్మరించి నిర్మించిన అక్రమ కట్టడాలను కూల్చివేసేందుకు హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ప్రభుత్వ భూముల సంరక్షణలో భాగంగా సుమారుగా 1,264 ఎకరాలను కాపాడేందుకు హైడ్రా ఈ చర్యలు చేపట్టింది.

**పీటీసీ, సంగారెడ్డి**

-------------------------------

**మహాత్మా జ్యోతి బాపూలే**

సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు ఫూలే జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నారు. మహిళలు, బలహీనవర్గాల అభ్యున్నతికి, అంటరానితనాన్ని రూపుమాపేందుకు ఆయన చేసిన కృషిని స్మరించుకుంటూ నివాళులు అర్పిస్తున్నారు. సామాజిక న్యాయం, మహిళా విద్య కోసం మహాత్మా ఫూలే చేసిన కృషి అందరికీ

మార్గదర్శకంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అంబర్ పేటలో ఉన్న మహాత్మ పూలే విగ్రహానికి కేంద్ర బొగ్గు, గనుల మంత్రి కిషన్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. సమానత్వం నిండిన సమాజ సాధనకు ఆయన చేసిన కృషిని స్మరించుకున్నారు. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మహాత్మా ఫూలే సేవలను కొనియాడారు.

**డెస్క్, పీటీసీ – హైదరాబాద్**

-------------------------------

**ఫూలే – జిల్లాలు**

ఖమ్మంలో జ్యోతిరావు పూలే విగ్రహానికి రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. వర్ణ వివక్షను రూపుమాపడం కోసం, దళితులు, బహుజనులు, మహిళల అభ్యున్నతికోసం, మహాత్మాఫూలే అందించిన కార్యాచరణ మహోన్నతమైనదన్నారు.

**బైట్: పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు ఫూలే 200వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

పూలే ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని మంచిర్యాల జిల్లా మందమర్రి సింగరేణి జీఎం రాధాకృష్ణ పిలుపునిచ్చారు.

నారాయణపేట జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో మహాత్మ జ్యోతిరావు పూలే 199 వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు

వరంగల్, ఆసిఫాబాద్, మెదక్ జిల్లాల్లో కూడా మహాత్మా ఫూలే జయంతి ఉత్సవాలను నిర్వహించారు.

**జనగామ, మంచిర్యాల, నారాయణ పేట, ఖమ్మం**

----------------------------------

**అడ్లూరి లక్ష్మణ్**

జగిత్యాల జిల్లాలో నిర్వహించిన పూలే జయంతి వేడుకల్లో రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. సమాజంలో సమానత్వం, విద్యా విస్తరణ కోసం కృషి చేశారని ఆయన ఆలోచనలు నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు.

**పీటీసీ – జగిత్యాల**

-------------------------------

**కరీంనగర్ – కోనేరు పల్లి**

జాతీయ స్థాయిలో నిర్వహించిన ''క్రీడా మిత్ర పంచాయతీ'' పోటీల్లో కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం కోనేరుపల్లె గ్రామ సర్పంచ్ కాసు వేణుగోపాల్ రాజు ప్రథమ బహుమతి గెలుచుకున్నారు. గ్రామీణాభివృద్ధిని వేగవంతం చేయడానికి, దేశంలోని గ్రామ సర్పంచులను అనుసంధానిస్తూ 'ఇండియా సర్పంచ్ సంవాద్ యాప్' ను క్వాలిటీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా రూపొందించింది. దీనిలో మార్చి నెలకు గాను నిర్వహించిన క్రీడా మిత్ర పంచాయతీ ప్రణాళికలో భాగంగా రూపొందించిన వీడియోకు కోనేరుపల్లె సర్పంచ్ ప్రథమ స్థానంలో నిలిచి, కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 35 వేల రూపాయల బహుమతి గెలుచుకున్నారు.

**పిటిసి, కరీంనగర్**

--------------------------------------

**IPL**

ఐపీఎల్ క్రికెట్‌లో భాగంగా ఈరోజు ముల్లాన్‌పూర్‌లోని చండీగఢ్‌లో మధ్యాహ్నం 3 గంటల 30 నిమిషాలకు జరిగే మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లు తలపడుతాయి. అలాగే రాత్రి 7 గంటల 30 నిమిషాలకు చెన్నైలోని చిదంబరం స్టేడియంలో జరిగే మరో మ్యాచ్

లో చెన్నైలో చెన్నై సూపర్ కింగ్స్, ఢిల్లీ క్యాపిటల్స్ తో తలపడుతుంది. కాగా నిన్న రాత్రి గువహటిలో జరిగిన మ్యాచ్ లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది.

**ఎస్ఎస్‌డీ**

--------------------------------

**సర్వైకల్ క్యాన్సర్**

సర్వైకల్ క్యాన్సర్ నివారణలో HPV టీకా కీలక పాత్ర పోషిస్తుందని జనగామ జిల్లా వైద్యాధికారి డాక్టర్  మల్లికార్జున రావు పేర్కొన్నారు. HPV టీకాపై ఆరోగ్య విభాగం నిర్వహించిన డీఎల్సీసీ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. జిల్లాలో 14 సంవత్సరాలు నిండి 15 సంవత్సరాలు మించని బాలికల కోసం ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టిందన్నారు. జిల్లాకు మొత్తం 1,079 టీకాలు కేటాయించగా 625 మంది బాలికలకు టీకాలు వేశామని వెల్లడించారు.

**పిటిసి,జనగామ జిల్లా**

-------------------------------

**యూపీఎస్సీ**

హన్మకొండ జిల్లాలో రేపు యూపీఎస్సీ నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ , నావల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద భద్రత, నిరంతర విద్యుత్, వైద్య సదుపాయాలు, ప్రశ్నాపత్రాల రవాణా తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

**వరంగల్ - పీటీసి**

-----------------------

**గిరిజన విశ్వవిద్యాలయం**

ములుగు జిల్లాలోని సమ్మక్క-సారక్క కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, ఐఐటీ హైదరాబాద్ మధ్య నిన్న చరిత్రాత్మక ఒప్పందం కుదిరింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థులకు అధునాతన సాంకేతిక విద్యను అందించేలా ప్రణాళికలు రూపొందించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కంప్యూటర్ సైన్స్, ఏఐ వంటి కోర్సులను ఐఐటీ సహకారంతో ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గిరిజన వర్సిటీ శాశ్వత భవనాలకు ఈ ఏడాదిలోనే భూమి పూజ చేస్తారని తెలియజేశారు.

**(HYD -PTC)**

------------------------------------